TRUTH | PEOPLE | NATION

ప్రజల పక్షం.. ప్రజా స్వరం..

# రిపబ్లిక్ హిందుస్థాన్

REPUBLIC HINDUSTHAN TELUGU DAILY

NEWS VIEWS FOR A BETTER TOMORROW

సత్యం కోసం.. సమాజం కోసం.. భారతం కోసం..

సంపుటి: 2 సంచిక: 143 | ఆదివారం 04 అక్టోబర్ 2026 | ఆదిలాబాద్ | హైదరాబాద్ | ఎడిటర్ : రాథోడ్ రాజు | పేజీలు : 4 | వెల: రూ.2.00



## పాక్‌ను చిత్తు చేసిన.. భారత్

**ఆసియా క్రీడల్లో స్వర్ణం నిలబెట్టుకున్న భారత్**

- పాక్‌పై 19 పరుగులతో భారత్ ఘన విజయం
- ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకున్న భారత్
- 20 బంతుల్లోనే అభిషేక్ శర్మ అర్ధశతకం
- 21 బంతుల్లో హాఫ్ సెంచరీ బాదిన తిలక్ వర్మ
- 96 పరుగులతో అజేయంగా నిలిచిన హసన్ నవాజ్

ఢిల్లీ,: ఆసియా క్రీడల క్రికెట్‌లో భారత జట్టు మరోసారి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్‌లో 19 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ (61), తిలక్ వర్మ (51 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌లతో భారత్ 211 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం భారత బౌలర్లు సమష్టిగా రాణించడంతో పాక్ 192 పరుగులకే పరిమితమైంది. హసన్ నవాజ్ (96 నాటౌట్) ఒంటరి పోరాటం చేసినా.. పాక్‌ను గెలిపించలేకపోయాడు.

## లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి

- దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలేనన్న మల్లికార్జున ఖర్గే
- మోదీ, అమిత్ షాతో పాటు అందరూ అక్రమంగా పదవుల్లో ఉన్నారని వ్యాఖ్య
- ఈవీఎంల దుర్వినియోగం జరిగిందని ఆరోపణ



2వ పేజీలో...



2వ పేజీలో...

## మీ వెన్నంటి భారత్ ఉంది

**అమెరికాలో ప్రవాసులకు పీయూష్ గోయల్ భరోసా**

- ప్రపంచంలో ఎక్కడున్నా భారతీయులకు దేశం అండగా నిలుస్తుందన్న మంత్రి
- యెమెన్, ఉక్రెయిన్ సంక్షోభాలను ఉదహరించిన కేంద్ర మంత్రి
- ప్రవాస భారతీయులు భారత్, అమెరికాల మధ్య జీవ వారధులు
- మీరు స్వీకరించిన దేశానికి విశ్వాసంగా ఉండాలని సూచన
- గాంధీ జయంతి సందర్భంగా షికాగోలో ప్రవాసులతో సమావేశం

ఢిల్లీ,: ప్రపంచంలో ఏ మూలన ఉన్నా, ఎలాంటి కష్టాల్లో చిక్కుకున్నా ప్రవాస భారతీయులకు తమ దేశం అండగా నిలుస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ భరోసా ఇచ్చారు. "మీ వెన్నంటి భారత్ ఉంది" అంటూ అమెరికాలోని ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. గాంధీ జయంతి సందర్భంగా షికాగోలో పర్యటించిన ఆయన, స్కోకీలోని మహాత్మా గాంధీ స్మారక విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అక్కడి ప్రవాస భారతీయులతో మాట్లాడారు.



## ఆర్చరీలో మరో గోల్డ్.. తొలి భారత మహిళగా కుంకుమ్ చరిత్ర

హైదరాబాద్: భారత యువ ఆర్చర్ కుంకుమ్ మొహోద్ సంచలన విజయం సాధించింది. ఆసియా క్రీడల్లో మహిళల వ్యక్తిగత రికర్వ్ ఆర్చరీ విభాగంలో స్వర్ణ పతకం కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. ఈ విభాగంలో వ్యక్తిగత పతకం సాధించిన తొలి భారత మహిళగా కుంకుమ్ రికార్డు నెలకొల్పింది. టోర్నీ ఆరంభం నుంచే అద్భుత ప్రదర్శన కనబరిచిన కుంకుమ్.. కీలక మ్యాచ్ లోనూ అదే జోరును కొనసాగించింది. ఉత్కంఠభరితం గా సాగిన ఫైనల్ పోరులో కొరియాకు చెందిన యుజె న్‌పై ఆధిపత్యం చెలాయించింది. కీలకమైన షూటౌట్‌లో ఒత్తిడిని ఏమాత్రం పట్టించుకోకుండా 10 పాయింట్ల షాట్‌తో విజయాన్ని ఖరారు చేసింది. ఈ విజయంతో కుంకుమ్ మొహోద్‌కు మరో అరుదైన అవకాశం కూడా దక్కింది. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు భారత్‌కు వ్యక్తిగత కోటా స్థానాన్ని సాధించింది. దీంతో ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకంతో పాటు.. ఒలింపిక్స్‌కు కోటా స్థానం సాధించిన ఘనతను కూడా తన ఖాతాలో వేసుకుంది. ఈ విజయంతో కుంకుమ్ ఆసియా క్రీడల్లో తన పతకాల సంఖ్యను మూడుకు పెంచుకుంది. ఇందులో రెండు స్వర్ణాలు ఉన్నాయి.

## పిల్లలకు తల్లిదండ్రులు ప్రేమగా అవగాహన కల్పించాలి

**నల్సా సౌత్ జోన్ రీజినల్ కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, అక్టోబర్ 3: హైదరాబాద్‌లో నల్సా సౌత్ జోన్ రీజినల్ కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పిల్లల సైబర్ భద్రతపై మాట్లాడారు. 'మనం పెద్దవాళ్లం ఏది మంచో.. ఏది చెడో.. ఏది నిజమో.. ఏది అబద్ధమో తెలుసుకోగలం. కానీ పిల్లలు అలా కాదు. వారికి లోకంతీరు తెలియదు. పిల్లలు సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారు. వాళ్లు భయంతో ఎవరికీ చెప్పలేకపోతున్నారు. ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు పాత్ర ప్రముఖమైనది. ముందుగా పిల్లలతో కాస్త మాట్లాడండి. వారి గురించి తెలుసుకోండి.



2వ పేజీలో...

## శ్రీసిటీలో.. ఘోర ప్రమాదం



**బాయిలర్ పేలి ఐదుగురు మృతి, 10 మందికి తీవ్ర గాయాలు!**



2వ పేజీలో...



## అనంతగిరి ఘాట్ రోడ్డులో బస్సు బోల్తా

- నలుగురు మృతి
- 15 మందికి తీవ్రగాయాలు
- అంత్యక్రియలకు వెళ్తుండగా విషాదం..

వికారాబాద్ : ఊరి అల్లుడి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు బంధువులతో కలిసి బయలుదేరిన వారి ప్రయాణం విషాదాంతమైంది. వికారాబాద్ జిల్లా శంకర్‌పల్లి మండలం కేసారం నుంచి ధారూర్ మండలం చింతకుంటకు వెళ్తున్న ప్రైవేట్ బస్సు అనంతగిరి ఘాట్ రోడ్డులో బోల్తా పడింది. బస్సులో దాదాపు 50 మంది ఉండగా.. ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. సుమారు 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసి వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అంత్యక్రియల కోసం బయలుదేరిన కుటుంబాల్లో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



2వ పేజీలో...

## నా పోటీ హుజూర్‌నగర్ నుంచే

**వదంతులు నమ్మొద్దు: మంత్రి ఉత్తమ్**

- వచ్చే ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేసిన ఉత్తమ్
- తుంగతుర్తి నియోజకవర్గానికి మారుతున్నాననే వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి

## కెప్టెన్ స్మిత్‌ను పరామర్శించిన దుబాయ్ యువరాజు



2వ పేజీలో...

- స్మిత్‌ను ఆస్పత్రిలో కలిసిన దుబాయ్ యువరాజు
- ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న హమ్దాన్
- స్మిత్ ధైర్యాన్ని ప్రత్యేకంగా ప్రశంసించిన యువరాజు
- స్మిత్‌తో ఫొటోలను పంచుకున్న యువరాజు
- స్మిత్‌ను చూసి యూఏఈ గర్విస్తోందని వ్యాఖ్య

ఢిల్లీ,: ప్రాణాలను లెక్కచేయకుండా విమానంలోని 174 మందిని కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చుర్‌ను దుబాయ్ యువరాజు షేక్ హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ స్వయంగా వెళ్లి పరామర్శించారు. దుబాయ్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. స్మిత్‌ను కలిసిన అనంతరం యువరాజు ఆయన ధైర్యాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు.

కరీంనగర్, : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాజకీయ కంచుకోటగా భావించే సిరిసిల్ల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన అధి కారిక అభివృద్ధి కార్యక్రమాలు, రాజకీయ బహిరంగ సభ మార్పు సంకేతాలు ఇచ్చింది. అధికారంలో ఉన్న పార్టీ నిర్వహించే ఏ సభకైనా యంత్రాంగం, నిధుల అండతో జనాన్ని సమీకరించడం సహజమే అయినప్పటికీ.. సిరిసిల్ల సభకు తరలివచ్చిన జనసందోహంలో ఒక ఆర్గానిక్ ఉత్సాహం కొట్టొచ్చినట్లు కనిపించింది.



## గులాబీ కోటలను బద్దలు కొడతారా..?

2వ పేజీలో...

# గులాబీ కోటలను బద్దలు కొడతారా..?



మొదటిపేజీ తరువాయి...

బలవంతపు తరలింపులకు, స్వచ్ఛందంగా తరలివచ్చే ప్రజా స్పందనకు మధ్య ఉండే విభజన రేఖ ఈ సభలో స్పష్టంగా రుజువైంది. కేటీఆర్‌కు ఎదురేలేదని భావించిన స్వంత గడ్డపైనే ఇంతటి భారీ స్థాయిలో కాంగ్రెస్ బలప్రదర్శన విజయవంతం కావడం గులాబీ శిబిరాన్ని ఆత్మరక్షణలోకి నెట్టింది.తెలంగాణ ఉద్యమ కాలం నుంచి సుదీర్ఘంగా ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కేటీఆర్‌పై స్థానికంగా యాంటీ-ఇన్‌కంబెన్సీ నెమ్మదిగా బలపడుతోందన్న సంకేతాలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. ఉద్యమ సెంటిమెంట్ పూర్తిగా కనుమరుగైపోవడంతో.. ప్రజలు ఇకపై కేవలం భావోద్వేగాల ఆధారంగా కాకుండా, క్షేత్రస్థాయి పాలన, నేత అందుబాటులో ఉండే తీరు, చేనేత-రైతు సంక్షేమ హామీల అమలు ఆధారంగానే తమ రాజకీయ తీర్పులను నిర్ణయించే వాస్తవికతలోకి వచ్చారు. గత పదేళ్లలో ఐటీ హబ్‌లు, హైటెక్ మౌలిక వసతుల పేరిట జరిగిన ప్రచారం క్షేత్రస్థాయి సామాన్యుల జీవితాలను ఎంతవరకు మార్చిందనే ప్రశ్నలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ బాధితుల సమస్యలు, నేతన్నల ఆత్మహత్యల నివారణలో గత ప్రభుత్వ వైఫల్యాలు ఇప్పటికీ పచ్చిగానే ఉండటం స్థానిక అసంతృప్తికి ఆజ్యం పోస్తోంది. ఈ ప్రజా వ్యతిరేకత కేవలం అసెంబ్లీ సభతోనే మొదలుకాలేదు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లోనే దీనికి స్పష్టమైన సంకేతాలు కనిపించాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న సిరిసిల్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కు భారీ మెజారిటీ లభించడం కేటీఆర్ రాజకీయ ఆధిపత్యానికి పడిన మొదటి గట్టి ఎదురుదెబ్బ. బండి సంజయ్‌కు 73 వేల ఓట్లు వస్తే , బీఆర్ఎస్ అభ్యర్థికి 65వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. కేటీఆర్ తన సొంత ఇలాకాలోనే ఆధిక్యాన్ని కాపాడుకోలేకపోయారన్న నిజం.. ఓటర్ల మైండ్‌సెట్ మారిపోయిందనడానికి తిరుగులేని ఆధారంగా నిలిచింది. ఒకప్పుడు బీఆర్ఎస్‌కు ఏకపక్ష మద్దతు ఇచ్చిన ఓటర్లు క్రమంగా బీజేపీ వైపు మొగ్గు చూపడం ప్రారంభించగా.. ఇప్పుడు ఆ రాజకీయ శూన్యంలోకి కాంగ్రెస్ వేగంగా చొచ్చుకువెళ్లేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేస్తున్న ఎత్తుగడలు సిరిసిల్ల రాజకీయాలను మునుపటి కేటీఆర్ వర్సెస్ ఇతరులు స్థాయి నుంచి మార్చి, కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ ప్రధాన పోరుగా తీర్చిదిద్దే దిశగా సాగుతున్నాయి. గత లోక్ సభ ఎన్నికల ఫలితాలతో రెండో స్థానానికి వెళ్లిన బీఆర్ఎస్‌ను పూర్తిగా మూడో స్థానానికి పరిమితం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని, సంక్షేమ పథకాలను రేవంత్ సిరిసిల్లాపై కేంద్రీకరిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు, స్థానిక వర్గాలకు భరోసా ఇస్తూ క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలమైన సంస్థాగత పునాదులను ఏర్పాటు చేస్తోంది. ఈ సభ ద్వారా రేవంత్ రెడ్డి వేసిన తొలి అడుగు భవిష్యత్తులో మరింత దూకుడుగా మారనుందని, కేటీఆర్‌ను ఆయన సొంత గడ్డపైనే రాజకీయంగా కట్టడి చేసేందుకు కాంగ్రెస్ దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకు వెళ్తోందని స్పష్టమవుతోంది.

# పాక్‌ను చిత్తు చేసిన భారత్..



మొదటిపేజీ తరువాయి...

అభిషేక్ మెరుపులు.. తిలక్ దూకుడు: టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌కు అభిషేక్ శర్మ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. పాక్ బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 20 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. దీంతో పాక్‌పై టీ20ల్లో అత్యంత వేగంగా హాఫ్ సెంచరీ చేసిన భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. గతంలో 2025లో దుబాయ్‌లో 24 బంతుల్లో సాధించిన తన రికార్డునే అధిగమించాడు. అభిషేక్ 28 బంతుల్లో 61 పరుగులు చేశాడు. ఇందులో మూడు ఫోర్లు, ఏడు సిక్సర్లు ఉన్నాయి. ఆ తర్వాత తిలక్ వర్మ తనదైన శైలిలో చెలరేగాడు. కేవలం 21 బంతుల్లోనే అర్ధశతకం సాధించాడు. శివమ్ దూబేతో కలిసి ఆరో వికెట్‌కు 62 పరుగులు జోడించాడు. దీంతో భారత్ 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది.

హసన్ పోరాటం వృథా: 212 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్‌కు హసన్ నవాజ్ అండగా నిలిచాడు. భారత బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ 51 బంతుల్లోనే 96 పరుగులతో అజేయంగా నిలిచాడు. సైమ్ అయూబ్ (29) మినహా మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. భారత స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు తీసి పాక్ పరుగుల వేగానికి అడ్డుకట్ట వేశారు. చివర్లో శివమ్ దూబే కూడా రెండు వికెట్లు పడగొట్టడంతో పాక్ 20 ఓవర్లలో లక్ష్యానికి 19 పరుగుల దూరంలో నిలిచిపోయింది. దీంతో భారత్ స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది. ఆసియా క్రీడల క్రికెట్లో మహిళల స్వర్ణం కూడా భారత్ ఖాతాలో చేరడం తెలిసిందే. ఇప్పుడు పురుషుల టీమ్ కూడా ఫైనల్లో గెలవడంతో క్రికెట్లో భారత్ గోల్డెన్ డబుల్ సాధించినట్టయింది.

# లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి

మొదటిపేజీ తరువాయి...

ఢిల్లీ,:కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్టేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు. ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

# శ్రీసిటీలో ఘోర ప్రమాదం



మొదటిపేజీ తరువాయి...

తిరుపతి, అక్టోబర్ 3: జిల్లాలోని శ్రీసిటీ పారిశ్రామికవాడలో భారీ పేలుడు తీవ్ర కలకలం రేపింది. సత్యవేడు మండలం శ్రీసిటీలోని టిల్ హెల్త్‌కేర్ పరిశ్రమలో బాయిలర్ పేలినట్లు సమాచారం. నైట్ షిఫ్ట్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు కార్మికులు ఈ ప్రమాదంలో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు భయాందోళనకు గురయ్యారు. పేలుడు ధాటికి పలువురు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. మొదట ఇద్దరు మృతి చెందినట్లు సమాచారం అందగా.. ఆ తర్వాత మృతుల సంఖ్య నలుగురికి చేరినట్లు తెలుస్తోంది. పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం అందుతోంది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన నెలకొంది. ప్రమాదంపై మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పేలుడు జరిగిన వెంటనే అప్రమత్తమైన రెస్క్యూ బృందాలు.. సిబ్బంది సహాయక చర్యలు ప్రారంభించారు. పరిశ్రమలో చిక్కుకున్న కార్మికులను బయటకు తీసుకొచ్చేందుకు రెస్క్యూ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. శిథిలాల కింద మరెవరైనా చిక్కుకున్నారా అనే అనుమానంతో సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. మృతుల వివరాలు ఇవే..: పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 5కి చేరింది. గౌరబ్ రాయ్ (35), చిన్న మస్తాన్ (36), రమేష్ (40) మృతిచెందినట్లు అధికారులు గుర్తించారు. మరో మృతదేహాన్ని గుర్తించాల్సి ఉంది. తీవ్రంగా గాయపడిన వాసు (36) చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. పేలుడు ధాటికి పరిశ్రమ శకలాలు సుమారు 100 మీటర్ల దూరంలో పడిపోయాయి. గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే.. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో ఎంతమంది కార్మికులు విధుల్లో ఉన్నారు.. పేలుడుకు అసలు కారణం ఏమిటనే విషయాలు ఇంకా పూర్తిగా తెలియాల్సి ఉంది. బాయిలర్‌లో సాంకేతిక లోపం కారణంగానే పేలుడు జరిగిందా.. మరేదైనా కారణం ఉందా అనే కోణంలో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడయ్యే వరకు మృతులు, క్షతగాత్రుల సంఖ్యపై స్పష్టత రావాల్సి ఉంది.

# నా పోటీ హుజూర్‌నగర్ నుంచే.. వదంతులు నమ్మొద్దు

మొదటిపేజీ తరువాయి...



హైదరాబాద్: తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తుంగతుర్తికి మారవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈరోజు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి... తన నియోజకవర్గం మార్పుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అంతమాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తాననడం అవాస్తవమని తెలిపారు.

ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణలో డిజైన్‌కు సంబంధించిన లోపాలుంటే, ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అయితే, నిర్మాణ ఏజెన్సీల పరిధిలోకి వచ్చే సమస్యలు ఏవైనా ఉంటే, వాటిని ఆయా సంస్థలే సొంత ఖర్చుతో సరిచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

# విద్యుత్ సమస్యలపై కోదాడ సబ్‌స్టేషన్ ముట్టడి

**- చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆందోళన**

**- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

**- అధికారులను బయటకు వెళ్లకుండా అడ్డుకున్న రైతులు**

కోదాడ, అక్టోబర్ 03 : ?కాలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సకాలంలో మార్చకపోవడం, నిరంతర విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయంటూ ఆగ్రహించిన రైతులు శనివారం కోదాడ విద్యుత్ సబ్‌స్టేషన్ బైఠాయించి నిరసన తెలిపారు. సిపిఐ మండల కార్యదర్శి బత్తినేని హనుమంతరావు ఆధ్వర్యంలో తమ్మర, గణపవరం, ద్వారకుంట, యతిరాజపురం తండా గ్రామాలకు చెందిన రైతులు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు బయటకు వెళ్లకుండా అడ్డుకుని ఆందోళన నిర్వహించారు. ?ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి బత్తినేని హనుమంతరావు మాట్లాడుతూ.. విద్యుత్ అధికారులు ఎడాపెడా కోతలు విధిస్తుండటంతో పాటు కాలిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఇవ్వడానికి నెలల తరబడి తిప్పించుకుంటున్నారని మండిపడ్డారు. అరకొరగా ఇస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు కూడా నాణ్యత లేకపోవడంతో అమర్చిన కొద్ది రోజులకే కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు పొట్టదశకు వచ్చి చేతికి అందే సమయంలో నీళ్లు లేక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే సరఫరా చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాయపూడి కాటమరాజు,బత్తినేని శ్రీను, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, బండ్ల రంగయ్య, శ్రీరామ్ శ్రీను,నన్నే సాహెబ్, ముంద్రా సతీష్, మంగ్య, కాసాని రాంబాబు పాల్గొన్నారు.

# రేవంత్ కుటుంబ వ్యాపారాలపై విచారణ జరపాలి



**- కాంగ్రెస్ పాలనలో సీఎం కుటుంబ వ్యాపారాలు అమాంతం పెరిగాయని విమర్శ**

**- మెడికవర్ తదితర సంస్థలపై విచారణకు డిమాండ్**

**- తన ఆరోపణలు తప్పైతే క్షమాపణ చెబుతానని వ్యాఖ్య: బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్**

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్లలో సీఎం కుటుంబానికి సంబంధించిన వ్యాపారాలు అమాంతం విస్తరించాయని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి కుటుంబంతో సంబంధం ఉన్న మెడికవర్ హాస్పిటల్స్, మ్యాక్స్ బీఎన్ ఫార్మా, మైండ్ వాల్ కన్‌స్ట్రక్షన్స్, శోదా కన్‌స్ట్రక్షన్స్, స్వచ్ బయో, టెసరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ వంటి సంస్థలు వేగంగా అభివృద్ధి చెందాయని క్రిశాంక్ ఆరోపించారు. ఈ కంపెనీలు భారీ అవకతవకలకు పాల్పడుతున్నాయని, దీనికి సంబంధించిన పత్రాలను ఈడీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాని కార్యాలయం, రాష్ట్రపతి కార్యాలయాలతో పాటు ప్రతిపక్ష నేతలకూ అందజేస్తానని తెలిపారు. ఈ ఆరోపణలపై విచారణకు ముఖ్యమంత్రి ఆదేశించాలని క్రిశాంక్ డిమాండ్ చేశారు. కొన్ని కంపెనీలలో దుంప శిరీష డైరెక్టర్‌గా ఉండటం వెనుక ఉన్న పాత్రను కూడా తేల్చాలన్నారు. తన ఆరోపణలు అవాస్తవమని తేలితే, మరోసారి ప్రెస్ మీట్ పెట్టి రేవంత్ రెడ్డి కుటుంబానికి బహిరంగ క్షమాపణ చెబుతానని స్పష్టం చేశారు. ఇలాంటి అంశాలను ప్రస్తావిస్తున్నందుకే తనను రెండుసార్లు జైలుకు పంపారని, తన ఇంటి తలుపులు పగలగొట్టారని, తన బిడ్డను కూడా బెదిరించారని క్రిశాంక్ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఆస్తులు, భూముల విషయంలో ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్న నేపథ్యంలో క్రిశాంక్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# పిల్లలకు తల్లిదండ్రులు ప్రేమగా అవగాహన కల్పించాలి

మొదటిపేజీ తరువాయి...

అలా అని వారు చేసే పొరపాట్లపై కోప్పడకూడదు. వారికి నెమ్మదిగా ప్రేమతో అవగాహన కల్పించండి. అవసరమైనప్పుడు సైబర్ నేరాల కోసం - 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం - 1098 నెంబర్లను సంప్రదించండి' అని ముఖ్యమంత్రి సూచించారు.

'పిల్లలు, మహిళల భద్రత పట్ల రాష్ట్రప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. దేశంలోనే తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టును హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాం. పోలీసులు, భరోసా కేంద్రాలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, ప్రత్యేక కోర్టులు, న్యాయ సేవా సంస్థలు, విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో సాఎజు-భరోసా సైబర్ ల్యాబ్‌లు.. ఇలా మన దగ్గర అనేక వ్యవస్థలు ఉన్నాయి. ఈ వ్యవస్థలన్నీ సమన్వయంతో పనిచేయాలి. అంతేకాకుండా.. పాఠశాల విద్యాశాఖతో TGS-LSA అవగాహన ఒప్పందం(MOU) కుదుర్చుకుంది. దీంతో ఉపాధ్యాయులు పిల్లలకు వారి చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు 3,000 మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చాం. బాధిత పిల్లలకు అన్నీ రకాలుగా ప్రభు త్వం అండగా ఉంటుంది. ఆర్థిక సహాయం నుంచి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం కల్పించడం వరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. పిల్లలను రక్షించేందుకు తల్లిదండ్రులు, న్యాయశాఖ, ప్రభుత్వం కలిసి పనిచేయాలి' అని ముఖ్యమంత్రి రేవంత్ పిలుపునిచ్చారు.

# కెప్టెన్ స్మిత్‌ను పరామర్శించిన దుబాయ్ యువరాజు

మొదటిపేజీ తరువాయి...

స్మిత్‌పై తమకు పూర్తి గౌరవం, అభిమానం ఉన్నాయని తెలిపారు. యూఏఈ నాయకత్వం కూడా ఆయనను గర్వంగా చూస్తోందని చెప్పారు. స్మిత్ యూఏఈ విలువలకు ప్రతీకగా నిలిచారని యువరాజు పేర్కొన్నారు. దయ, శాంతి, మానవ ప్రాణాలకు విలువ ఇచ్చే దేశంగా యూఏఈ నిలుస్తుందని చెప్పారు. స్మిత్‌తో మాట్లాడుతున్న ఫొటోలను యువరాజు సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆయనను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న దృశ్యాలు కూడా అందులో కనిపించాయి. విమానంలో సహ పైలట్ దాడి చేయడంతో స్మిత్ తీవ్రంగా గాయపడ్డ విషయం తెలిసిందే. విమానాన్ని కూల్చేందుకు ప్రయత్నించిన సహ పైలట్‌ను అడ్డుకునేందుకు ఆయన గాయాలతో వీరోచితంగా పోరాడారు. అనంతరం కాక్‌పిట్ తలుపు తెరవడంతో ప్రయాణికులు లోపలికి వెళ్లి దాడిచేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో విమానంలోని 174 మంది ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలను కాపాడటంలో స్మిత్ కీలక పాత్ర పోషించారు. తీవ్ర గాయాల మధ్య కూడా ఆయన చూపిన ధైర్యంపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయి.

# కోదాడలో ది చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభం

## – సినీనటి రితికా నాయక్ సందడి

కోదాడ, అక్టోబర్ 03 : కోదాడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ది చెన్నై షాపింగ్ మాల్ ను సినీనటి రితక నాయక్, స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి శనివారం ప్రారంభించారు. మాల్‌లోని పలు విభాగాలను సందర్శించి నూతన వస్త్ర శ్రేణిని, డిజైన్‌లను ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం వేదికపై నటి రితిక నాయక్ పలు పాటలకు సరదాగా స్టెప్పులు వేసి వీక్షకుల్లో హుషారు నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. కోదాడ పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రజలకు అత్యాధునిక మోడల్స్, నాణ్యమైన వస్త్రాలు ఒకేచోట లభించేలా ది చెన్నై షాపింగ్ మాల్ అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నెని కుసుమ వెంకటరత్నం బాబు, వైస్ చైర్మన్



దేవరపల్లి మల్లేశ్వరి, కమిషనర్ రమాదేవి, స్థానిక కౌన్సిలర్ కోల్లా కోటిరెడ్డి, పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, షాపింగ్ మాల్ నిర్వాహకులు మర్రి వెంకటరెడ్డి, పట్టణ పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# మీ వెన్నంటి భారత్ ఉంది

మొదటిపేజీ తరువాయి...

గతంలో యెమెన్, ఉక్రెయిన్ సంక్షోభాల సమయంలో విదేశాల్లోని భారతీయుల భద్రత కోసం ప్రభుత్వం ఎంతగా తపించిందో ఆయన గుర్తుచేశారు. "మీరు ఏ దేశంలో, ఏ పరిస్థితుల్లో ఉన్నా మీ మాతృభూమి మీకు అండగా ఉంటుంది. మీ కుటుంబాలకు, మీ పిల్లలకు తోడుగా నిలుస్తుంది" అని గోయల్ స్పష్టం చేశారు. అమెరికా, భారత్ మధ్య ప్రవాస భారతీయులు ఒక జీవ వారధిలాంటి వారని గోయల్ అభివర్ణిం చారు. "మీలో ప్రతి ఒక్కరూ అమెరికాలో భారత రాయబారులే" అని ఆయన అన్నారు. ప్రవాస భారతీయులు తాము స్వీకరించిన దేశానికి (అమెరికాకు) నిజాయతీగా, నిబద్ధతతో సేవ చేయాలని సూచించారు. అదే సమయంలో, తమ మాతృభూమిని, ఇక్కడి ప్రజలను తమ హృదయంలో పదిలంగా ఉంచుకోవాలని కోరారు. ఈ పర్యటనలో భాగంగా, 1893లో స్వామి వివేకానంద చరిత్రాత్మక ప్రసంగం చేసిన ఫుల్లర్టన్ హాల్‌ను కూడా ఆయన సందర్శించారు.

R. HINDUSTAN
రిపబ్లిక్ హిందుస్థాన్
తెలుగు దినపత్రిక

# జోడేఘాట్‌లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**కొమురం భీం 86వ వర్ధంతిపై కలెక్టర్ హరిత, ఐటీడీఏ పీవో మకరందు సమీక్ష**



**సిర్పూర్(యు),కెరమెరి అక్టోబర్ 03:** కొమురం భీం 86వ వర్ధంతిని ఈ నెల 26న జోడేఘాట్‌లో ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె.హరిత, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు అధికారులను ఆదేశించారు. శనివారం జోడేఘాట్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి వర్ధంతి ఏర్పాట్లపై వారు సమీక్ష నిర్వహించారు.వర్ధంతి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో గిరిజనులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, రవాణా, పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.కార్యక్రమ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన మేర తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి వసతులు కల్పించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచడంతోపాటు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.కార్యక్రమానికి వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని చెప్పారు. రహదారుల నిర్వహణ, సూచిక బోర్డులు, స్వాగత ఏర్పాట్లు, సమాచార కేంద్రాలు, సహాయక సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.కొమురం భీం జీవితం, ఆయన పోరాట స్ఫూర్తి, ఆదివాసీల హక్కుల కోసం చేసిన ఉద్యమాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమం ఉండాలని కలెక్టర్, ఐటీడీఏ పీవో తెలిపారు. గిరిజన సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలకు ప్రాధాన్యం ఇస్తూ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.ఈ సందర్భంగా కొమురం భీం మనవడు సోనేరావు, గిరిజన సంఘాల నాయకులు, ప్రతినిధులు తమ సూచనలు, అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. శాఖల వారీగా అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్, ఐటీడీఏ పీవో అధికారులను ఆదేశించారు. సమావేశంలో కుమురం భీం మనుమడు సోనేరావు సర్పంచ్ ఆత్రం భీంరావు,గ్రామ పటేల్,ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్,మోడీ సర్పంచ్ ఆత్రం లక్ష్మణ్ రావు,వాంకిడి సిఐ వేణుగోపాల్, ఎస్సై రాజు, తహసీల్దార్ నాగార్జున, మండలం విద్యాధికారి ఆడే ప్రకాష్ కోవ ఇందిరా,మడావి రఘునాథ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గిరిజన సంఘాల నాయకులు ప్రతినిధులు పాల్గొన్నారు



# ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా సకాలంలో సరుకుల పంపిణీ పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 03:** జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా సరుకుల పంపిణీ, నిల్వలు, రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శనివారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ , పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసిల్దార్ లతో కలిసి ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలు, డిప్యూటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్లతో సరుకుల పంపిణీ, నిల్వలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలు, డిప్యూటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్లకు అవసరమైన మేరకు సరుకులను సకాలంలో లిఫ్ట్ చేసుకోవాలని, లబ్ధిదారులకు సరుకుల పంపిణీని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఎల్ఎస్ పాయింట్లలో స్టాక్‌కు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. ప్రతి నెల స్టాక్ వివరాలను పరిశీలించి, సంబంధిత రికార్డులతో పూర్తి స్థాయిలో రీకన్సిలియేషన్ నిర్వహించాలని ఆదేశించారు. సరుకుల నిల్వలు, పంపిణీ, లిఫ్టింగ్ తదితర అంశాలలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విమానాశ్రయానికి కుమ్రం భీం పేరే పెట్టాలి

**కేంద్రం వెంటనే ఆమోదించాలి**

**ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు పటేల్**




**ఆదిలాబాద్ 03:**ఆదిలాబాద్ ప్రతిపాదిత విమానాశ్రయానికి మహావీరుడు కుమ్రం భీం పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫారసు చేయడంపై ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు పటేల్ హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఆదివాసీ సమాజం చేస్తున్న డిమాండ్‌కు రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం చారిత్రాత్మక నిర్ణయమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జల్--జంగల్--జమీన్ కోసం పోరాడిన కుమ్రం భీం పేరు విమానాశ్రయానికి పెట్టడం ఆదివాసీల ఆత్మగౌరవానికి గుర్తింపుగా నిలుస్తుందన్నారు. నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సైతం జాప్యం చేయకుండా ప్రతిపాదనను ఆమోదించి కుమ్రం భీం పేరును అధికారికంగా ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుంరం చత్రుఘన్ తదితరులు పాల్గొన్నారు.

# హామీ ఇచ్చారు.. అమలు మరిచారు..

**ఆర్టీసీ విలీనంపై కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం**

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్**



**ఆసిఫాబాద్ ప్రతినిధి03:** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చాక ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ ఆరోపించారు. శనివారం ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి రెండేళ్లు కావస్తున్నా విలీనంపై ఎలాంటి పురోగతి లేదన్నారు. ఆర్టీసీ కార్మికుల ఉద్యోగ భద్రత, వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. 2025 వేతన సవరణలో మాస్టర్ పే స్కేల్ అమలు చేయలేదని, మూడు రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీల్లో 32 సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఆర్టీసీకి ఆదాయం పెంచే బాధ్యతను కార్మికులు నిర్వర్తిస్తున్నా వారి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. అక్టోబర్ 9న జరిగే ఎన్నికల్లో క్లాజ్-3లో బస్సు గుర్తుకు, క్లాజ్-6లో నిచ్చెన గుర్తుకు ఓటు వేసి ఎంప్లాయీస్ యూనియన్‌ను గెలిపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, ఉపాధ్యక్షుడు కోదురుపాక మహేశ్, నాయకులు ప్రవీణ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు నాకాబందీ

**అనుమానితుల కదలికలపై నిఘా**

**డీసీపీ ఏ.భాస్కర్**

**సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు**



**,మంచిర్యాల 03:**నేరాల నియంత్రణకు పోలీసులు నాకాబందీ నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలో అనుమానిత వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెంచినట్లు మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ తెలిపారు. పట్టణంలోని బ్యాంకులు, బంగారు దుకాణాలు, మార్కెట్లు, లాడ్జీలు, వాణిజ్య సంస్థల వద్ద తనిఖీలు చేపట్టారు.బ్యాంకులు, గోల్డ్ షాపులను లక్ష్యంగా చేసుకుని జరిగే చోరీలు, దోపిడీలను అడ్డుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు డీసీపీ తెలిపారు. ఖాతాదారుల దృష్టి మళ్లించి నగదు, విలువైన వస్తువులు అపహరించే ముఠాలపై నిఘా పెట్టామన్నారు. ప్రధాన రహదారులు, సరిహద్దు ప్రాంతాల్లో ఆర్మడ్ పోలీస్, ప్రత్యేక బృందాలతో తనిఖీలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.వాహనాలకు స్పష్టమైన నంబర్ ప్లేట్ ఉండాలని, దానిని వంచడం, మార్చడం లేదా లేకుండా వాహనాలు నడపరాదని సూచించారు. లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలో ఉన్నందున నేరస్థులు సరిహద్దులు దాటి పారిపోకుండా నిఘాను మరింత పటిష్ఠం చేసినట్లు డీసీపీ తెలిపారు. నాకాబందీ, తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించి వాహన పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోదరావు, ట్రాఫిక్ పోలీసులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్ద కాయలతో అధిక దిగుబడి

**బ్రహ్మోస్ బీజీ-2 పత్తి రకంతో మంచి ఫలితాలు**

**ఎల్ఎస్ఆర్ సీడ్స్ కంపెనీ ఆర్ఎం ఎన్.తిరుపతి**



**వాంకిడి 03:** బ్రహ్మోస్ బీజీ-2 పత్తి రకం పెద్ద, బరువైన కాయలతో పాటు అధిక దిగుబడినిస్తుందని ఎల్ఎస్ఆర్ సీడ్స్ కంపెనీ ఆర్ఎం ఎన్.తిరుపతి అన్నారు. మండలంలోని కమాన గ్రామంలో లోబాడీ పత్రు పత్తి చేనులో నిర్వహించిన పత్తి రకం ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. ఈ రకంలో ఎక్కువ కొమ్మలు ఏర్పడటంతో దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందని, పురుగులు, దోమలు, పేనుబంక తదితర తెగుళ్లను తట్టుకునే శక్తి ఉందన్నారు. పత్తి సాగులో రైతులకు మెరుగైన ఫలితాలు అందించడమే లక్ష్యంగా నాణ్యమైన విత్తనాలను అందిస్తున్నామని పేర్కొన్నారు.ప్రదర్శనను 13 గ్రామాలకు చెందిన సుమారు 356 మంది రైతులు వీక్షించారు. రైతు పత్రుతో పాటు పలువురు రైతులు పంట తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ శ్రీరామ ఆగ్రో ఏజెన్సీస్ (లక్షెట్టిపేట), వాంకిడి వైష్ణవి ట్రేడర్స్ డీలర్లు, జిల్లా సేల్స్ ఆఫీసర్ కే.నరేష్, ఇతర జిల్లాల సేల్స్ ఆఫీసర్లు మహేందర్, జీవన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# సంకల్ప సభకు తరలిరావాలి

**బీఎస్పీ నేత కాదాశి రవీందర్**



**మంచిర్యాల 03:** బీఎస్పీ వ్యవస్థాపకుడు మాన్యవర్ కాన్షీరాం వర్ధంతిని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న బహుజన రాజ్యాధికార సంకల్ప సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి కాదాశి రవీందర్ పిలుపునిచ్చారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్ సమావేశ ప్రాంగణంలో సభకు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. మంచిర్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి పెట్టం చంద్రశేఖర్, అధ్యక్షుడు బండారి రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసును ఛేదించిన పోలీసులు

**తోటి రజకుడిని హతమార్చిన నిందితుడి అరెస్టు**




**తిర్యాణి03:**గంభీరావుపేటలో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. తోటి రజకుడిని కత్తితో గొంతు కోసి హతమార్చిన కటుకూరి బాపు (48)ను రెబ్బెన పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గంభీరావుపేటకు చెందిన బాపు, రాచకొండ సత్తయ్య (48) ఇద్దరూ రజక వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నారు. గ్రామంలో జరిగే శుభకార్యాలకు సత్తయ్యకే ఎక్కువగా పని లభిస్తుండటంతో తనకు ఉపాధి దక్కడం లేదన్న కక్షతో బాపు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబరు 30న రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సత్తయ్యను కత్తితో గొంతు కోసి హత్య చేసినట్లు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి నిందితుడిని గుర్తించారు. రెబ్బెన సీఐ సంజయ్‌కుమార్ శనివారం బాపును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ చిన్నపాటి వివాదాలను ఆవేశంతో హింసాత్మకంగా మార్చుకోవద్దని, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు జీవితాలను నాశనం చేస్తాయని తెలిపారు. సమస్యలు ఉంటే పెద్దల ద్వారా లేదా పోలీసులను ఆశ్రయించి చట్టపరంగా పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట తిర్యాణి ఎస్సై సుబ్బారావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# వన్యప్రాణులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత



**జైపూర్ 03:** అడవులు, వన్యప్రాణులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అటవీ అధికారులు అన్నారు. జైపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జాతీయ వన్యప్రాణి వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అడవుల పరిరక్షణ, వన్యప్రాణుల ప్రాధాన్యం, పర్యావరణ సమతుల్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వన్యప్రాణులను వేట నుంచి కాపాడటంతో పాటు అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి. రాజ్యలక్ష్మి, స్టూడెంట్స్ కౌన్సెలర్ మెంబర్ బండి ప్రసాద్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జి. సుధాకర్, సెక్షన్ ఆఫీసర్లు రామకృష్ణ, సి. రేవతి, ఎం.డి. ముజిబుద్దీన్, బీట్ ఆఫీసర్లు కే. రమేష్, పి. వసంతలక్ష్మి, జి. శ్రావణ్‌కుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# కోదాడలో ది చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభం

**– సినీనటి రితికా నాయక్ సందడి**

కోదాడ, అక్టోబర్ 03 : కోదాడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ది చెన్నై షాపింగ్ మాల్ ను సినీనటి రితక నాయక్, స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి శనివారం ప్రారంభించారు. మాల్‌లోని పలు విభాగాలను సందర్శించి నూతన వస్త్ర శ్రేణిని, డిజైన్‌లను ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం వేదికపై నటి రితిక నాయక్ పలు పాటలకు సరదాగా స్టెప్పులు వేసి వీక్షకుల్లో హుషారు నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. కోదాడ పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రజలకు అత్యాధునిక మోడల్స్, నాణ్యమైన వస్త్రాలు ఒకేచోట లభించేలా ది చెన్నై షాపింగ్ మాల్ అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు, వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి, కమిషనర్ రమాదేవి, స్థానిక కౌన్సిలర్ కోల్లా కోటిరెడ్డి, పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, షాపింగ్ మాల్ నిర్వాహకులు మర్రి వెంకటరెడ్డి, పట్టణ పుర ప్రముఖులు పాల్గొన్నారు.



## కరెంట్ కోసం రామాయంపేటలో
# రైతుల రాస్తారోకో

రామాయంపేట: వసాయానికి కనీసం 8 గంటల విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆరోపిస్తూ మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో రైతులు రాస్తారోకో చేపట్టారు. రామాయంపేట-ఎల్కతుర్తి జాతీయ రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో సుమారు రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉందని, ఈ సమయంలో నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఈ సందర్భంగా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి 8 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్నా.. ఎప్పుడు సరఫరా నిలిచిపోతుందో, ఎప్పుడు పునరుద్ధరిస్తారో తెలియని పరిస్థితి ఉందన్నారు. విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా అందించాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాను సక్రమంగా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల రాస్తారోకోతో రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్సై బాలరాజు అక్కడకు చేరుకుని రైతులను సముదాయించి, ఆందోళనను విరమింపజేశారు. అనంతరం ట్రాఫిక్ పునరుద్ధరించారు.

# పట్టభద్రులంతా ఓటరుగా నమోదు కావాలి

**బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డిలి**
**వరంగల్ సెంట్రల్ లైబ్రరీని సందర్శించి విద్యార్థులకు విజ్ఞప్తి**



హనుమకొండ, అక్టోబర్ 3, రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా శనివారం వరంగల్ సెంట్రల్ లైబ్రరీని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి సందర్శించారు. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులను కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సాధారణ ఎన్నికలతో పోలిస్తే చాలా భిన్నమైనదని, ఇందులో ఉన్నత విద్యావంతులు, మేధావులు, సమాజం పట్ల సంపూర్ణ అవగాహన ఉన్నవారే ఓటు వేస్తారని అన్నారు. కాబట్టి ఇచ్చే తీర్పుకు ఎంతో విలువుంటుందని, నిరంతరం తమ కోసం పోరాడుతున్న వారికే మద్దతుగా నిలవాలని, ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చి హడావుడి చేసి మొహం చాటేసే వారికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మూడేళ్లు కావస్తున్నా 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, రాజీవ్ యువ వికాసం వికసించకుండానే వాడిపోయిందని, ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, ప్రైవేట్ రంగంలో తెలంగాణ యువతకు 75 శాతం ఉద్యోగాల హామీ, నిరుద్యోగ యువతకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, ఫీజు రీయింబర్స్ మెంట్, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్ హామీలన్నీ తుంగలో తొక్కారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రతీ పట్టభద్రుడు, నిరుద్యోగ యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత రెండేళ్లుగా తమ పక్షాన నిలబడి కొట్లాడుతున్న తనకు, బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉండాలని, జీవో 46 రద్దు కోసం సుప్రీంకోర్టుకు వెళ్లిన విషయం, జీవో 29 రద్దు కోసం పోరాడిన అంశాలను గుర్తు చేశారు.

# భార్యను హతమార్చిన భర్త



గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ఓబులోనిపల్లి గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. భార్యపై అనుమానంతో భర్త గోపి (40) తన భార్య జములమ్మ (35)పై రోకలిబండతో దాడి చేసి హత్య చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటన అనంతరం గోపి పరారైనట్లు సమాచారం. గట్టు మండలం ఆలూరు గ్రామానికి చెందిన గోపి సుమారు 17 ఏళ్ల క్రితం ఓబులోనిపల్లికి ఇల్లరికం వచ్చి జములమ్మను వివాహం చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా భార్యపై అనుమానంతో గోపి తరచూ జములమ్మతో గొడవప దేవాడని, గత రెండేళ్లుగా వీరి మధ్య వివాదాలు కొనసాగుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ క్రమంలో తాజాగా మరోసారి భార్యా భర్తల మధ్యవివాదం తలెత్తినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో గోపి రోకలిబండతో జములమ్మపై దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన జములమ్మ మృతి చెందినట్లు సమాచారం. ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపో యారు. దంపతులకు ఇద్దరు పిల్లలు ఉండటంతో వారి పరిస్థితిపై గ్రామంలో ఆవేదన వ్యక్తమవుతోంది. మరోవైపు గోపి మానసిక పరిస్థితి సరిగా లేదని కొందరు గ్రామస్తులు చెబుతున్నప్పటికీ, దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. భార్యపై అనుమానమే హత్యకు కారణమా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేయాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. పరారీలో ఉన్న గోపి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. జములమ్మ మృతికి దారితీసిన పూర్తి వివరాలు, ఘటనకు గల కారణాలు, నిందితుడి పాత్ర తదితర అంశాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## అమెరికాలో విషాదం..
# అనారోగ్యంతో నల్గొండ యువతి మృతి



మిర్యాలగూడ : ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలుగు యువతి తీవ్ర అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. క్యాన్సర్ మహమ్మారితో పోరాడి కన్నుమూసింది. నల్గొండ జిల్లా వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పీఏసీఎస్ సల్కునూరు మాజీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కందిమల్ల లక్ష్మిరెడ్డి, పద్మ దంపతుల చిన్న కుమార్తె మాన్విత రెడ్డి (26) హైదరాబాద్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఉన్నత చదువుల కోసం 2023లో అమెరికా వెళ్లింది. స్నేహితులతో కలిసి ఉంటూ ఎంఎస్ పూర్తి చేసింది. ఈ క్రమంలో ఆమె అనారోగ్యానికి గురైంది. సెప్టెంబర్ 4న అకస్మాత్తుగా తీవ్ర గొంతు నొప్పితో అనారోగ్యానికి గురికావడంతో స్నేహితులు ఆమెను బాల్టిమోర్‌లోని దవాఖానలో చేర్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు నాలుగో దశ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు. సెప్టెంబర్ 13న చికిత్స కోసం దవాఖానలో ఇన్ పేషెంట్‌గా చేర్చుకున్నారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ క్రమంలో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్టోబర్ 1న మాన్వితారెడ్డి మృతిచెందింది.

# బెజ్జూర్‌లో వన్యప్రాణి సంరక్షణపై ర్యాలీ..

బెజ్జూర్: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ కేంద్రంలో శనివారం వన్యప్రాణి వారోత్సవాలు భాగంగా అటవీశాఖ అధికారులు ర్యాలీ నిర్వహించారు. వన్య ప్రాణుల పట్ల, ప్రజలకు అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో బెజ్జూర్ మండల కేంద్రంలోని ఫారెస్ట్ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బెజ్జ ర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి జంజిరాల శ్రావణ్ కుమార్ మాట్లాడారు. అడవుల రక్షణతో పాటు వన్య ప్రాణులను సంరక్షించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారులు మనోహర్, సఫియా బేగం, సంతోష్, ఉపాధ్యాయులు విద్యార్థులు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



## పరిశుభ్రతే ఆరోగ్యానికి
# మూలాధారం

**'స్పెషల్ క్యాంపెయిన్-6 లో**
**జీఎం ఎన్. రాధాకృష్ణ పిలుపు**





**జననినాదం, మందమర్రి 03:** మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ శనివారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ఆవరణలో ప్రారంభమైన "స్పెషల్ క్యాంపెయిన్ - 6 " స్వచ్ఛ-స్వచ్ఛ భారత్" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, పూజ్య బాపూజీ కలలు కనిన స్వచ్ఛ భారత స్వప్నాన్ని సాకారం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. "గాంధీజీ కేవలం రాజకీయ స్వతంత్ర భారతమే కాకుండా, పరిశుభ్రమైన మరియు అభివృద్ధి చెందిన దేశాన్ని ఆకాంక్షించారు. ఆయన స్ఫూర్తితో 'స్వచ్ఛ తెలంగాణ' లక్ష్యాన్ని సాధిస్తూ, స్వచ్ఛ భారత్ రూపకల్పనలో సింగరేణి కుటుంబాలన్నీ భాగస్వామ్యం కావాలి అని పిలుపునిచ్చారు. పరిసరాల అపరిశుభ్రత వలన వ్యాధులు ప్రబలుతాయని, ఇది మన ఆరోగ్యంతో పాటు సమాజ ఆరోగ్యానికి కూడా హాని కలిగిస్తుందని హెచ్చరించారు. వారానికి కనీసం రెండు గంటలు శ్రమదానం చేసి మన ఇల్లు, పరిసరాలు, మరియు పని చేసే కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలి. మనం పాటించే ఈ పరిశుభ్రత, క్రమశిక్షణ రాబోయే భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి అని పేర్కొన్నారు. కార్యాలయాలు, గనులు మరియు పని ప్రాంతాలలో ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం ఉంటే ఉద్యోగుల పనితీరు, ఉత్పాదకత మెరుగవుతాయని ఆయన తెలిపారు. సింగరేణి అధికారులు, ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులు పరిశుభ్రతను ఒక నిత్యకృత్యంగా మలుచుకుని, స్వచ్ఛమైన వాతావరణంలో "రక్షణతో కూడిన ఉత్పత్తి" కూడా సాధించవచ్చని ఆకాంక్షించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో స్వచ్ఛ-స్వచ్ఛభారత్ (స్పెషల్ క్యాంపెయిన్-6) ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం, జి.ఎల్. ప్రసాద్, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ, సలేంద్ర సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) సిహెచ్.అశోక్, ఎన్విరాన్మెంట్ అధికారి కాతం వెంకట్ రెడ్డి, సీనియర్ పి ఓ, ఎం.కార్తీక్, ఏఐటి యుసి, జి ఎం, స్ట్రక్చర్ కమిటీ మెంబర్, సి.వి.రమణ, జిఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీ గీతిక మరియు జిఎం ఆఫీస్ ఉన్నత అధికారులు, అధికారులు, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

# సంకపల్లిలోని 45 ఇండ్లకు పరిహారం ఎప్పుడు ఇస్తారు

**బీఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మీ నరసింహారావు**



వేములవాడ, చర్చావేదిక : వేములవాడలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు పార్టీ నాయకులతో కలిసి మాట్లా డారు. సిరిసిల్లలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఆది శ్రీనివాస్‌కు వాక్చాతుర్యం, మాట్లాడే ప్రతిభ ఉన్నప్పటికీ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆ స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదని చల్మెడ విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పకుండా ఇతర అంశాలను తెరపైకి తీసుకురావడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. మిడ్ మానేరు బాధితుల సమస్యలకు సమాధానం చెప్పాలి..: చల్మెడ మిడ్ మానేరు ముంపు గ్రామాల సమస్యలను ప్రస్తావిస్తూ.. గతంలో సంకపల్లి వంటి గ్రామాల్లో అప్పటి పిసిసి అధ్యక్షుడిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యటించిన సందర్భంగా నిర్వాసితులకు రూ.5.04 లక్షల పరిహారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మిడ్ మానేరు సమస్యలు 2005--06 కాలం నుంచే కొనసాగుతున్నాయి. 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వాసితులకు సంబంధించిన పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొని ప్రాజెక్టును పూర్తి చేసింది. ఇప్పుడు మిగిలిన సమస్యల పరిష్కారంపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలి అని చల్మెడ అన్నారు. ఆనాడు ప్రకటించి చేసిన తప్పును సవరించుకొని ఇవ్వలేమని చెప్పి... మధ్య మానేరు ప్రజలను మభ్యపెడుతూ రూ.5.04 లక్షల పరిహారం కోసం 9 సంవత్సరాలు మంత్రి పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్ ఉద్యమాలు నడిపారని గుర్తు చేశారు. సాక్షాత్తు రేవంత్ రెడ్డి పాదయాత్రలో ప్రతి కుటుంబానికి 5 లక్షల 4 వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకొని గద్దెని ఎక్కాక ఇప్పుడు వారి సమస్యలు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. సంక పల్లిలోని 45 ఇండ్లకు పరిహారం ఎప్పుడు ఇస్తారు, ముంపు గ్రామాల ప్రజలకు 5 లక్షల 4 వేల రూపాయలు ఎప్పుడు ఇస్తారో తేదీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.. జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి సభలో ఆది శ్రీనివాస్ గుర్తు చేసిన సీఎం ఎందుకు హామీ ఇవ్వలేదని ప్రశ్నించారు. ఒకవేళ మీతోని సాధ్యం కాకపోతే ముంపు గ్రామాల ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని సవాల్ విసిరారు..యువత, మహిళలకు ఇచ్చిన ఉపాధి హామీలు ఏమయ్యాయి..? నిరుద్యోగ యువత, మహిళలకు కుటీర పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చినట్లు పేర్కొంటున్న హామీల అమలు పరిస్థితిని ప్రభుత్వం వివరించాలని చల్మెడ కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేటీఆర్ చొరవతో చేపట్టినట్లు పేర్కొంటున్న ఆక్వా హబ్ ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని అన్నారు. "ప్రాజెక్టు ద్వారా ఎంతమందికి ఉపాధి కల్పించారు? ప్రస్తుతం పనులు ఏ దశలో ఉన్నాయి? మిగిలిన పనులను ఎప్పటిలోగా పూర్తి చేస్తారు?" అని ప్రశ్నించారు.

## విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంపొందించి..
# ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలి

- **విద్యార్థుల మనస్తత్వాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ సరైన మార్గనిర్దేశం చేయాలి**
- **అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**
- **జిల్లా ఎస్పీ మహేష్ బి.గితేరాజన్న**




సిరిసిల్ల జిల్లా, చర్చావేదిక : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని టీ అర్ ఎస్ ఎం ఎ. రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమనికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు.విద్యార్థుల్లో సామా జిక స్పృహను పెంపొందించి, వారు జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. విద్యార్థులతో తల్లిదండ్రులతో పాటు ఎక్కువ సమయం గడిపేది ఉపాధ్యాయులేనని, కాబట్టి వారి ప్రవర్తన, ఆలోచనా విధానం, మనస్తత్వంలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన సమయంలో సరైన మార్గనిర్దేశం చేయాలని , పిల్లలు తమ సమస్యలను తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులతో కూడా పంచుకునే అవకాశం ఉన్నందున పాఠశాలల్లో వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆధునిక సాంకేతిక యుగంలో సామాజిక మాధ్యమాలు సమాచార వినియోగనికి ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ, వాటి అధిక వినియోగం వల్ల విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా, విజ్ఞతతో వినియోగించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు.విద్యార్థులు ఆపదకర పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు వాటిని ఎలా గుర్తించాలి, ఎలా స్పందించాలి, ఎవరి ని సంప్రదించాలి అనే అంశాలపై అవగాహన కల్పించాలని సూచిం చారు. జిల్లాలో షీ టీమ్ బృందం ఆధ్వర్యంలో గుడ్ టచ్‌బ్యాడ్ టచ్, బాలల రక్షణ, సైబర్ భద్రత తదితర అంశాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్ర మంలో డీఎస్పీ నాగేంద్రచారి, (టీ అర్ ఎస్ ఎం ఎ)రాష్ట్ర నాయకులు శివరాత్రి యాదగిరి, రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు, డి.టి.ఓ. శ్రీనివాస్, టీ అర్ ఎస్ ఎంఎం ఎ జిల్లా అధ్యక్షులు నాగుల శ్రీనివాస్ గౌడ్, కరస్పాండెంట్లు, ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.